నగర/పట్టణ ఓటర్లే అధికం

ఓటేసేందుకు దూరంగా ఉన్న ఓటర్లలో అత్యధికులు నగర, పట్టణ ఓటర్లే ఉన్నారు. కర్నూలు నియోజకవర్గంలో నగరంలో 99,492 మంది ఓటు వేయలేదు. అంటే.. మొత్తం ఓటర్లలో 36.25 శాతం ఓటింగ్ దూరంగా ఉన్నారు. ఆదోని నియోజకవర్గంలో 87,994 ఓటర్లు (33.45 శాతం), పాణ్యం నియోజకవర్గంలో 85,771 ఓటర్లు (25.56 శాతం) ఓటర్లు ఓటు వేయలేదు. ఈ మూడు నియోజకవర్గాల్లో అర్బన్ ఓటర్లే పోలింగ్ రోజున ఇల్లు దాటకపోవడం కొసమెరుపు. పత్తికొండ, మంత్రాలయం, ఆలూరు, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో 15-20 శాతంలోపే ఓటర్లు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. 3 లక్షలకు పైగా ఓటర్లు ఓటు వేయలేదని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ఇల్లు దాటని పట్టణ ఓటర్లు..!

ఓటింగ్‌కు దూరంగా 4.85 లక్షల ఓటర్లు


ఓటు వేయని వారిలో అత్యధికులు కర్నూలు, ఆదోని ఓటర్లే

- సెలవు ఇచ్చినా పోలింగ్ కేంద్రానికి రాని వైనం
- గతం కంటే పెరిగిన పోలింగ్

ఈ అనాసక్తి దేనికి..?



కర్నూలు, మే 20 (ఆంధ్రజ్యోతి):
ఓటర్లందరూ ఎన్నికల్లో పాల్గొనాలని ప్రభుత్వం, ఎలక్షన్ కమిషన్ చాలా ప్రయత్నాలు చేస్తుంటాయి. ఓటు ప్రజాస్వామ్యానికి వెన్నెముక అని, ఓటుతో తలరాతలు మార్చుకోవచ్చని, ఓటు వేయడం పౌరుల బాధ్యత అని ప్రచారం చేస్తుంటారు. ఈసారి సార్వత్రికల ఎన్నికల్లో అయితే అధికారుల పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు కూడా చేపట్టారు. చివరాఖరికి పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు శక్తిమేరకు డబ్బులు కూడా పంచినట్లు సమాచారం. అయినా ఒక్క కర్నూలు జిల్లాలోనే 4.85 లక్షల మంది ఓటర్లు పోలింగ్ కేంద్రానికి వెళ్లడానికి ఆసక్తి చూపలేదు. ఓటు చుట్టూ ప్రచారంలో ఉన్న భావనలపట్ల పౌరుల్లో ఉన్న అనుమానాలను ఈ అనాసక్తి ఎత్తి చూపుతోంది. ఎవ్వరికి ఓటు వేసినా ఒకటే అనిగాని, ఎవరు గెలిచినా మన కష్టాలు మనకు తప్పవనిగాని పౌరులు అనుకుంటున్నట్లు భావించవచ్చు. ఓటర్లు తమ జీవితానుభవాల నుంచి ఈ వైఖరికి వచ్చారా? అనేదాన్ని కూడా ఇది సూచిస్తున్నదా? ఆలోచించాల్సి ఉంటుంది. అదీ ప్రధానంగా పట్టణ, నగర ఓటర్లే ఆసక్తి చూపలేదంటే ఎన్నికల ప్రక్రియపట్ల ఇదొక ధోరణిగా గుర్తించాలా? ఏదేమైనా ఈ విడత పోలింగ్ బాగా పెరిగినా 23.58 శాతం ఓటర్లు జిల్లాలో పోలింగ్‌లో పాల్గొనలేదు.



ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో గతంకంటే పోలింగ్ శాతం పెరిగింది. పోలింగ్‌లోని అనేక ధోరణులు విజయావకశాలను ప్రభావితం చేస్తాయి. అందులో పోలింగ్ పెరగడం ఒకటి. దీన్ని పరిగణలోకి తీసుకొని ఫలితాలు ఎలాఉండవచ్చునో విశ్లేషణలు సాగుతున్నాయి. కానీ ఆశ్చర్యకరమైన అంశం ఏమంటే జిల్లాలో 23.58 శాతం ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనలేదని తేలింది. వారిలో అత్యధికులు నగర, పట్టణ ఓటర్లే ఉన్నారు. విద్యావంతులు, రాజకీయ పరిణామాలపట్ల ఎంతో కొంత అవగాహన ఉన్న వాళ్లు హోరాహోరిగా సాగిన ఎన్నికల పట్ల ఉదాసీనంగా ఉండిపోయారు. గ్రామీణ ప్రాంతాల్లో పెరిగిన పోలింగ్‌లాగే పట్టణ ప్రాంతాల్లోని ఈ అనాసక్తత కూడా ఎన్నికలపట్ల ఒకానొక వైఖరికి గుర్తనే విశ్లేషణలు సాగుతున్నాయి. నిజానికి ఈసారి ఎన్నికల షెడ్యూలు జారీ చేసినప్పటి నుంచి పోలింగ్ రోజు వరకు ఓటర్లందరూ పోలింగ్‌లో పాల్గొనాలని అధికారులు వివిధ రూపాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అయినా.. ఫలితం కనిపించ లేదు. కర్నూలు నగరం, ఆదోని, పాణ్యం నియోజకవర్గంలోని కల్లూరు అర్బన్ వార్డుల్లో ఎక్కువ శాతం ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేదని తెలుస్తోంది. నగర/పట్టణ ప్రాంతాల్లో, అందులోనూ విద్యావంతులు ఉండే ప్రాంతాల్లో పోలింగ్ తగ్గడానికి గల కారణాలపై రాజకీయ నాయకులు, జిల్లా అధికారులు ఆరా తీస్తున్నారు. మేధావి వర్గంగా భావించేవాళ్ల ఇంత పెద్ద సంఖ్యలో ఆసక్తి చూపకపోవడం మన ప్రజాస్వామ్య ప్రక్రియల మంచి చెడ్డలను అంచనా వేసుకోడానికి దోహదం చేస్తుందనే చర్చ జరుగుతోంది. ప్రశ్నించే గొంతుకులే ఓటు వేయకపోతే ప్రజాస్వామ్య తీర్పు ఎలా ఉంటుందో..? అనే చర్చ కూడా జరుగుతోంది.

జిల్లాలో మొత్తం ఓట్లు, పోలైన ఓట్లు, పోలింగ్‌కు దూరంగా ఉన్న ఓటర్ల వివరాల

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	ఓటుకు దూరంగా	శాతం
కర్నూలు	2,74,465	1,74,973	99,492	36.25
పాణ్యం	3,31,706	2,46,935	85,771	25.56
పత్తికొండ	2,23,603	1,90,009	33,594	15.01
కోడుమూరు(ఎస్సీ)	2,46,632	1,95,181	55,451	20.86
ఎమ్మిగనూరు	2,47,752	2,03,086	44,666	18.03
మంత్రాలయం	2,08,350	1,75,667	32,683	15.69
ఆదోని	2,63,058	1,75,064	87,994	33.45
ఆలూరు	2,58,997	2,09,092	49,905	19.27
మొత్తం	**20,54,563**	**15,70,007**	**4,84,556**	**23.58**



పోలింగ్‌కు దూరంగా 4.85 లక్షల ఓటర్లు:

జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో 20,54,563 మంది ఓటర్లు ఉన్నారు. ఈ నెల 13న జరిగిన పోలింగ్ లెక్కలు పరిశీలిస్తే 15,70,007 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 76.42 శాతం పోలింగ్ నమోదైంది. 4,84,556 ఓటర్లు అంటే 23.58 శాతం ఓటు వేయలేదని తెలుస్తున్నది. 2009 ఎన్నికల్లో ఆదోని నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కె.మీనాక్షినాయుడుకు 45,294 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన వై. సాయిప్రసాద్‌రెడ్డికి 45,038 ఓట్లు వచ్చాయి. కేవలం 256 ఓట్ల తేడాతో మీనాక్షినాయుడు విజయం సాధించారు. అంటే.. పోలైన 1,16,604 ఓట్లతో పోలిస్తే కేవలం 0.22 శాతం ఓట్లు తేడానే అభ్యర్థుల భవితవ్యమే మార్చేసింది. కర్నూలు నియోజకవర్గంలో 1952 ఎన్నికల్లో దామోదరం సంజీవయ్య ప్రత్యర్థి శంకరరెడ్డిపై కేవలం 0.82 శాతం ఓట్ల తేడాతో గెలిచారు. 2004 ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థి ఎంఏ గఫూర్ ప్రత్యర్థి టీడీపీ అభ్యర్థి టీజీ వెంకటేశ్‌పై 1.69 శాతం, 2014 ఎన్నికల్లో ఎస్వీ మోహన్‌రెడ్డి 2.41 శాతం ఓట్ల తేడాతో గెలిచారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి చెన్నకేశవరెడ్డి ప్రత్యర్థి టీడీపీ అభ్యర్థి బీవీ మోహన్‌రెడ్డిపై కేవలం 1.81 శాతం ఓట్ల తేడాతోనే విజయం సాధించారు. 1952 నుంచి 2019 వరకు జిల్లాలో జరిగిన ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే.. చాలా నియోజకవర్గల్లో ఒక శాతం కంటే తక్కువ ఓట్ల తేడాతో గెలిచి అసెంబ్లీకి వెళ్లిన ఎమ్మెల్యేలు ఉన్నారు. 1-5 శాతం లోపు ఓట్ల తేడాతో విజయం సాధించిన ఎమ్మెల్యే అనేక మంది ఉన్నారు. ఏకంగా 23.58 శాతం ఓటర్లు గడప దాటి పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేదంటే ఆ ప్రభావం ఎవరిపై ఉంటుందనే చర్చ జరుగుతోంది. వీరిలో కనీసం 10-15 శాతం ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేసి ఉంటే జూన్ 4 నాటి ఫలితాల్లో భారీగా మార్పు ఉండేదని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.



జిల్లాలో కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గం సహా కర్నూలు, కోడుమూరు (ఎస్సీ), ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నెల 13న పోలింగ్ జరిగింది. అభ్యర్థుల భవితవ్యం ఈవీఎం యంత్రాల్లో నిక్షిప్తమై రాయలసీమ యూనివర్సిటీ స్ట్రాంగ్ రూంల్లో మూడంచెల భద్రత మధ్య భద్రంగా ఉంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంటుంది. అందుకోసం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు డాక్టర్ జి. సృజన నేతృత్వంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఓట్ల లెక్కింపు సిబ్బందితో శనివారం సమావేశం అయ్యారు. అదే క్రమంలో జిల్లాలో ఏ నియోజకవర్గంలో ఏ అభ్యర్థి గెలుస్తారు..? ఉమ్మడి జిల్లాలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి..? రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే పార్టీ ఏదీ..? ఏ ఇద్దరు కలసినా ఇదే చర్చ జరుగుతున్నది. అదే క్రమంలో రాజకీయ నాయకులు పట్టణ వార్డులు, గ్రామాల వారిగా పోలైన ఓట్ల లెక్కలను ముందేసుకొని పోలింగ్ సరళి పరిశీలిస్తున్నారు. ఎక్కడ పోలింగ్ శాతం తగ్గింది..? అందుకు గల కారణాలు ఏమిటి..? అనే వివరాలను ఆరా తీస్తున్నారు. అయితే.. గతం కంటే పోలింగ్ శాతం పెరిగినా లక్షల మంది ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేసేందుకు ఆసక్తి చూపలేదు.

పకడ్బందీగా కౌంటింగ్

కలెక్టర్ జి.సృజన

కర్నూలు(కలెక్టరేట్), మే 20: జూన్ 4వ తేదీన జరగనున్న ఎన్నికల కౌంటింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. సృజన రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక రాయలసీమ యూనివర్సిటీలోని కంట్రోల్ రూమ్‌లో స్ట్రాంగ్ రూమ్ లైవ్ ఫీడ్, ఈవీఎం యంత్రాలను భద్రపరిచిన ఇంజనీరింగ్ బ్లాక్‌ను, కౌంటింగ్ హాల్‌ను ఎస్పీ జి. కృష్ణకాంత్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ హాలులో ఏ విధంగా టేబుల్స్, చైర్లు ఏర్పాటు చేసుకుంటే సౌకర్యంగా ఉంటుందో చూసుకోవాలని రిటర్నింగ్ అధికారులను సూచించారు. పాణ్యం ఆర్వో, జేసీ నారపురెడ్డి మౌర్య, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, కర్నూలు ఆర్డీవో, కోడుమూరు ఆర్వో శేషిరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ నాగరాజు తదితరులు ఉన్నారు.



ఆర్‌యూలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, జేసీలు

రైతులకు శుభవార్త

- ఈసారి మంచి వర్షాలే కురుస్తాయి
- ముందస్తు వానాలతో విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్న రైతులు



కర్నూలు(అగ్రికల్చర్), మే 20: రుతుపవనాలు చురుగ్గా విస్తరిస్తున్నాయని, ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు అత్యవసరమైన నైరుతి రుతుప వనాలు రెండు రోజుల కిందట దక్షిణ అండమాన్ ప్రాం తంలో నికోబార్ దీవుల్లోకి ప్రవేశించాయని వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. దీని వల్ల ఈసారి వర్షాలు బాగా కురుస్తాయని తెలిపారు. మే 31న నైరుతి రుతుపవనాలు కేరళను తాకనున్నాయని, జూన్ మొదటి వారంలో రాయలసీమలోని అన్ని జిల్లాల్లో రుతుపవనాలు విస్తరించి వర్షాలు కురుస్తాయని జేడీ వరలక్ష్మి తెలిపారు. బంగాళాఖాతంలో రుతుపవనాలు వేగంగా వ్యాపిస్తున్నాయని, ఎల్నీనో బలహీనమై లానినో పరిస్థితులు వచ్చే అవకాశం ఉండటం వల్ల వర్షాలు విస్తారంగా కురుస్తాయని ఆమె స్పష్టం చేశారు. భూమధ్య రేఖ వద్ద పసిఫిక్ సముద్రం చల్లబడటంతో వర్షాలు కురవడానికి అనుకూల వాతావరణం ఏర్పడిందని, ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చెప్పినట్లు జేడీ వరలక్ష్మి అన్నారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో అధికవర్షపాతం కురిసేందుకు అవకాశం ఉందని వారు అంచనా వేసినట్లు స్పష్టం చేశారు. మరోవైపు బంగాళాఖాతంలో మే 22న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, దీని వల్ల మే 24న అల్పపీడనం వాయుగుండంగా మారి వర్షాలు విస్తారంగా కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు సోమవారం ప్రకటించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 6.20 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యే అవకాశం ఉందని అధిక దిగుబడి ముందస్తు వర్షాల వల్ల సాధ్యమవుతుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. నైరుతి రుతుపవనాల వల్ల జూన్ 77.7ఎంఎం, జూలైలో 90.7, ఆగస్టులో 116.2, సెప్టెంబరులో 116.5 ఎంఎం మొత్తం 406.1 ఎంఎం వర్షం కురిసే అవకాశం ఉందని అధికారవర్గాలు తెలిపాయి.

రబీ కరువు పరిహారం విడుదల


కర్నూలు(అగ్రికల్చర్), మే 20: కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రబీ సీజన్‌లో కరువు వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం రెండు రోజుల క్రితం రూ.128.87 కోట్ల పరిహారాన్ని విడుదల చేసినట్లు వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. కర్నూలు జిల్లాలో 26 మండలాల పరిధిలో రబీ సీజన్‌లో 70,982 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని, 58,901 మంది రైతులు నష్టపోయారని, వారికి రూ.71.57 కోట్లు పరిహారం ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. అదే విధంగా నంద్యాల జిల్లాలో 13 మండలాల పరిధిలో 58,011 మంది అన్నదాతలకు 59,207 హెక్టార్లలో సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయని, వారికి రూ.57.30 కోట్ల పరిహారాన్ని ప్రభుత్వం విడుదల చేసిందని అన్నారు. కాగా ఏ రైతుకు ఎంత మొత్తంలో పరిహారాన్ని అందించాలో పూర్తి వివరాలతో క్షేత్రస్థాయిలో సర్వే చేసేందుకు జాబితాలను సిద్ధం చేసేందుకు ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు సామాజిక తనిఖీలు చేపట్టి, తుది జాబితాను ఈ నెల 31లోగా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపుతామని జేడీ తెలిపారు.

మల్లన్న సేవలకు అదనపు భారం

- ఆన్‌లైన్‌లో నిలిచిన అభిషేకానంతరం టికెట్లు
- మల్లన్న స్పర్శ దర్శనానికి అదనపు వసూళ్లు
- దేవస్థానం వెబ్‌సైట్‌లో అంతరాయమే కారణం
- దర్శనానికి అవస్థలు పడ్డ భక్తులు
- ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ కొత్త నిర్ణయాలు



టిక్కెట్లను స్కాన్ చేయించుకుంటున్న భక్తులు



భక్తులు కొన్న అదనపు టికెట్లు

శ్రీశైలం, మే 20: శ్రీశైలంలో అభిషేక సేవలు జరిపించుకున్న భక్తులు సోమవారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దేవస్థానానికి చెందిన వెబ్‌సైట్‌లో ఆదివారం రాత్రి నుంచి అభిషేకానంతరం టిక్కెట్లు నిలిచిపోయాయి. ఇదే అదునుగా భావించి సోమవారం ఉదయం నుంచి భక్తుల వద్ద అదనపు రుసుములను దేవస్థానం అధికారులు వసూళ్లు చేసి స్వామివారి స్పర్శ దర్శనానికి అనుమతించారు. వెబ్‌సైట్‌లో అభిషేకం టిక్కెట్లు లభించినప్పటికీ వాటికి అనుసంధానంగా జారీ చేసే రూ.500 అభిషేకానంతరం టికెట్లు లభించక భక్తులు తీవ్ర ఆందోళన చెందారు. అభిషేక సేవా కర్తల వెంట వచ్చిన కుటుంబ సభ్యుల్లో ఇద్దరికి చొప్పున అదనపు చెలల్లింపులు చెల్లించాల్సి వచ్చింది. అభిషేకానంతర టికెట్లు అందుబాటులో లేని కారణంగా దేవస్థానం అధికారులు ఒక్కో భక్తుడికి రూ.300 టిక్కెట్లను రెండేసి చొప్పున కొనుగోలు చేయించి ఆలయంలోకి అనుమతించారు. ఒక్కో భక్తుడు రెండు టికెట్లను ఎందుకు తీసుకోవాలని క్యూలైన్ల వద్ద ఉన్న అధికారిని నిలదీశారు. అభిషేకానంతరం టిక్కెట్లు అందుబాటులో లేని కారణంగా, దేవస్థానం ఆదాయం కోల్పోకుండా చూడడంతోపాటు భక్తుడికి స్వామివారి స్పర్శ దర్శనం కల్పించేందుకు రెండేసి చొప్పున టిక్కెట్లు తీసుకోవాలని సూచించినట్లు దేవస్థానం పర్యవేక్షకురాలు హిమబిందు తెలిపారు. అయితే గతానికి భిన్నంగా దేవస్థానం అధికారులు కొత్త విధానాలను ప్రవేశపెడుతూ ఇబ్బందులు పెడుతున్నట్లు భక్తులు మండిపడుతున్నారు. గత రెండు రోజుల నుంచి దేవస్థానం అధికారులు, వెబ్‌సైట్ నిర్వాహకులు వెబ్‌సైట్‌లో మార్పులు చేస్తున్నారు. మార్పులు జరిగే క్రమంలో వెబ్‌సైట్ నుంచి అభిషేకానంతరం టిక్కెట్లు గల్లంతు కావడం భక్తులతోపాటు దేవస్థానం ఉద్యోగులను కూడా ఖంగు తినిపించింది. దేవస్థానంలోని ఐటీ విభాగం కూడా ఈ పరిణామాన్ని గుర్తించకపోవడం గమనార్హం. వెబ్‌సైట్‌లో నెలకొన్న అంతరాయం వల్ల వందలాది భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. సోమవారం సాయంత్రానికి కూడా సమస్య పరిష్కారం కాకపోవడంతో మరుసటి రోజు మంగళవారం కూడా ఆదే పరిస్థితి పునరావృతం కానుంది. అయితే దేవస్థానం వెబ్‌సైట్‌లో నెలకొన్న ఈ సమస్యను అధికారులు ఎప్పటిలోగ పరిష్కరిస్తారో కూడా వెల్లడించకపోవడం గమనార్హం. రాష్ట్రంలో తిరుమల తరువాత అతి పెద్ద దేవాలయం శ్రీశైలం దేవస్థానంలో భక్తులకు ఎటువంటి ముందస్తు ప్రకటన చేయకుండా వెబ్‌సైట్‌లో మార్పులు చేపట్టడం విమర్శలకు తావిస్తోంది. ఇంత జరుగుతున్న దేవస్థానం అధికారులు, వెబ్‌సైట్ నిర్వాహకుల నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేకపోవడం కొసమెరుపు.

వీడుతున్న గుట్టు

- ముగ్గురు మహిళల్లో ఇద్దరు హత్య..!
- పోలీసు అదుపులో ఆటో డ్రైవర్

కర్నూలు, మే 20: తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో గార్గేయపురం చెరువులో లభ్యమైన ముగ్గురు మహిళల అనుమానాస్పద మృతి కేసు ఓ కొలిక్కి వచ్చింది. 24 గంటల వ్యవధిలోనే పోలీసులు మిస్టరీని ఛేదించగలిగారు. గార్గేయపురం చెరువులో ఆదివారం ఉదయం ఇద్దరు మహిళల మృతదేహాలు, చెరువు పక్కన గట్టు మీద మరో మహిళ మృతదేహం లభ్యమైన విషయం తెలిసిందే. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. మహిళల మృతదేహాలు కుళ్లిపోయే స్థితికి చేరుకోవడంతో అంత్యక్రియలు నిర్వహించారు.

ఆ ఇద్దరు మహబూబ్‌నగర్ జిల్లా వాసులే..

మృతి చెందిన ముగ్గురు మహిళల్లో ఇద్దరు మహబూబ్‌నగర్ జిల్లా వాసులుగా గుర్తించారు. ఓ వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్న మహిళ సాయంతో ఆ ఇద్దరి వివరాలను తెలుసుకున్నారు. మృతి చెందిన వారిలో ఒకరు జానకి కాగా ఆమెది మహబూబ్‌నగర్ జిల్లా అబంగపట్నంగా గుర్తించారు. మరో మహిళ అరుణది కూడా ఇదే జిల్లానే. కానీ స్వస్థలం తెలియరాలేదు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు అనుమానాస్పద స్థితిలో వెళ్తున్న ఓ ఆటోను గుర్తించారు. ఆటో నెంబరు ఆధారంగా డ్రైవర్ షేక్ మహబూబ్‌బాషాను అదుపులోకి తీసుకున్నారు. షేక్ మహబూబ్‌బాషాతో అరుణకు గొడవలు ఉన్నట్లు తేలింది. ఈ నేపథ్యంలోనే అరుణను జానకిని తన ఆటోలో ఎక్కించుకుని గార్గేయపురం చెరువు వద్దకు తీసుకెళ్లినట్లు సమాచారం. అక్కడే వీరికి పూర్తిగా కల్లు తాపించి మద్యం మత్తులో ఉన్న వీరిని చెరువులోకి తోసేసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఆ కోణంలోనే ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. మరో మహిళను మాత్రం మతిస్థిమితం లేకుండా గుర్తించారు. స్థానికంగానే ఆ మహిళ తిరుగుతుండేదని, హోటళ్లలో నీరు ఇప్పించుకొని తాగుతుండేదని స్థానికులు చెబుతున్నారు. పూర్తి విషయాలు మంగళవారం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి పోలీసులు అధికారికంగా వివరాలు వెల్లడించాల్సి ఉంది.

మూడేళ్లుగా ఏం చేశారు?

- డీసిల్టేషన్ రీచులకు ఈసీ అవసరం లేదంటూ..
- తుంగభద్రను ఇష్టారాజ్యంగా తవ్వేశారు
- సుప్రీంకోర్టు ఆగ్రహంతో క్షేత్రస్థాయికి వెళ్లిన యంత్రాంగం
- ఆ రీచ్‌లకు పర్యావరణ అనుమతులు తప్పనిసరి
- మూడేళ్లుగా యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు
- ఇన్నాళ్లు కళ్లు మూసుకున్నారా..?

కర్నూలు, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తుంగభద్ర నది ఇసుక తవ్వకాల కోసం సి. బెళగల్ మండలం కొత్తకోట, కె. సింగవరం, పల్దొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె వద్ద నాలుగు డీసిల్టేషన్ రీచులు (నది నీటిలో బోటు ద్వారా ఇసుక తవ్వకాలు), కౌతాళం మండలం గుడికంబాలి-1,2,3, మరళి-1,2 కలిపి ఐదు ఓపన్ ఇసుక రీచులు, నందవరం మండలం నాగులదిన్నె వద్ద ఓపన్ ఇసుక రీచులను మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్, గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేసి గుర్తించారు. ఈ రీచ్‌లలో ఇసుక తవ్వకాలు, రవాణా కోసం రాష్ట్ర ప్రభుత్వం 2021 మేలో జేపీ పవర్ సంస్థకు రెండేళ్ల లీజు అనుమతులు ఇచ్చింది. ఈ లీజు గడువు 2023 మే 15న ముగిసినా.. ఆ సంస్థ ప్రభుత్వ పెద్దల అండదండలతో యథేచ్ఛగా తవ్వకాలు సాగించింది. ప్రస్తుతం ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థకు లీజు అనుమతులు దక్కించుకొని ఇసుక తవ్వకాలు చేపట్టింది. పర్యావరణ అనుమతులు (ఈసీ) ఇచ్చే వరకు ఇసుక తవ్వకాలు చేపట్టవద్దని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) 2023 జూన్ 2న ఆదేశాలు జారీ చేస్తే.. ఈసీతో పాటు భారత ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూఏఐ) నుంచి ఎన్‌వోసీ లేకుండా రీచ్‌లలో ఇసుక తవ్వకాలు చేపట్టరాదని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది తవ్వకాలు ఆగలేదు. ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు వెళ్లింది. సుప్రీంకోర్టు ఆగ్రహంతో జిల్లా అధికారులు ఇసుక రీచ్‌ల తనిఖీలకు వెళ్లారు. జిల్లా కలెక్టరు డాక్టర్ జి.సృజన నేతృత్వంలో మైనింగ్, ఇగిరేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పర్యావరణ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఇసుక అక్రమాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టవద్దని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) హెచ్చరించినా హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసినా తవ్వకాలు మాత్రం ఆగలేదు. పైగా డీసిల్టేషన్ రీచ్‌లకు పర్యావరణ అనుమతులు అవసరం లేదంటూ మూడేళ్లుగా పెద్దపెద్ద యంత్రాలు, బోట్లు పెట్టి తుంగభద్రను తవ్వేశారు. సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఇసుక రీచ్‌ల పరిశీలనకు కదిలిన యంత్రాంగం ఇసుక తవ్వకాలను చూసి నివ్వెరబోయింది. డీసిల్టేషన్ రీచ్‌లకు కూడా పర్యావరణ అనుమతులు తప్పక ఉండాల్సిందే అంటూ తేల్చేశారు. ఏ అనుమతి లేకుండా మరబోట్లతో నదీ గర్భాన్ని తవ్వేస్తుంటే అధికారులు కళ్లకు గంతలు కట్టుకున్నారా..? అన్న ప్రశ్నలు తలెత్తున్నాయి.



సి.బెళగల్ మండలం జి. సింగవరం రీచ్ వద్ద తుంగభద్ర నదిలో బోటింగ్ ద్వారా యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు (ఫైల్)

మూడేళ్లుగా ఏం చేశారు?

తుంగభద్రలో ఓపన్ రీచ్‌లకు మాత్రమే పర్యావరణ అనుమతులు అవసరం.. డీసిల్టేషన్ రీచ్‌లు (నది నీటిలో బోటు ద్వారా ఇసుక తవ్వకాలు)కు పర్యావరణ అనుమతులు అవసరం లేదంటూ మూడేళ్లుగా యథేచ్ఛగా తవ్వకాలు సాగించారు. సుంకేసుల బ్యారేజీ ఎగువన సి.బెళగల్ మండలం కొత్తకోట, కె.సింగవరం, పల్లెదొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె వద్ద తుంగభద్రలో సుమారు 20 బోట్ల ద్వారా డ్రెడ్జింగ్ (బోట్లను నదిలోకి పంపించి) ఇసుక తోడేశారు. ఒక్కో బోటు 20 టన్నుల వరకు ఇసుక ఒడ్డుకు చేరుస్తుంది. ఈ రీచ్‌ల నుంచి రోజుకు వంద టిప్పర్లు, లారీలకు పైగా ఇసుక రవాణా చేసినట్లు రికార్డుల ద్వారా తెలుస్తోంది. ప్రతి రోజు సగటున 2 వేల టన్నులు ప్రకారం ఏటా సరాసరి 6-7 లక్షల టన్నుల ప్రకారం మూడేళ్లలో 18-20 లక్షల టన్నుల ఇసుక తవ్వేసినట్లు అనధికారిక సమాచారం. ఈ రీచ్‌లకు ఎలాంటి పర్యావరణ అనుమతులు లేవని అధికారులే అంటున్నారు. అది, సోమవారాల్లో రెండు రోజులు జిల్లా కలెక్టరు డాక్టర్ జి.సృజన నేతృత్వంలో జిల్లా అధికారుల బృందం కౌతాళం, సి.బెళగల్ మండలాల్లో ఇసుక రీచ్‌లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీసిల్టేషన్ రీచ్‌లకు కూడా పర్యావరణ అనుమతులు ఉండాల్సిందే అంటూ సబంధింత శాఖ అధికారులు తేల్చి చెప్పారు. అంటే మూడేళ్ల భారీ యంత్రాలు, భారీ మరబోట్ల సహాయంతో నదిలోని ఇసుకను తోడేశారు. ఈసీ లేకుండా తవ్వకాలు చేస్తుంటే అధికారులు కళ్లకు గంతలు కట్టుకున్నారా..? ప్రభుత్వ శాఖ మధ్య సమన్వయలోపం ఇసుక తవ్వకందారులకు వరంగా మారింది. మూడేళ్లుగా ఎలాంటి పర్యావరణ అనుమతులు లేకుండా బోట్లతో తుంగభద్రను తవ్వేసిన నాటి జేపీ పవర్ సంస్థ, ప్రస్తుత లీజుదారుడైన ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు..? అన్నది ప్రశ్నార్థకమే.



గుంతలుగా మారిన తుంగభద్ర నది

ఈఐఏ అనుమతి తప్పనిసరి

మైనింగ్ అధికారులు గుర్తించి ఇసుక రీచ్‌ల్లో లీజు సంస్థ ఇసుక తవ్వకాల కోసం కర్నూలు ప్రాంతీయ వాతావరణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పర్యావరణ అనుమతులు (ఈసీ) ఇస్తారు. ఏటేటా ఈ అనుమతులు రెన్యువల్ చేసుకోవాలి. అందుకోసం ప్రభుత్వం నిర్ధేశించిన రుసుం చెల్లించాల్సి ఉంటుంది. పర్యావరణ అనుమతులు ఇవ్వాలంటే ఎన్విరాన్‌మెంటల్ ఇన్‌పాక్ట్ అసెస్‌మెంట్ అథారిటీ (ఈఐఏ) ఆమోదం తప్పక ఉండాల్సిందేనని పోల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు పేర్కొంటున్నారు. సి.బెళగల్ మండలం పల్దొడ్డి, కొత్తకోట డీసిల్టేషన్ రీచ్‌లలో ఇసుక తవ్వకాల నిమిత్తం మైనింగ్ అధికారులకు లీజ్ డబ్బులు చెల్లించారు. ఈ తరుణంలో పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టవద్దంటూ అధికారులు తేల్చిచెప్పారు. ఈ విషయాన్ని మైనింగ్ డీడీ రాజశేఖర్ దృష్టికి తీసుకెళ్లగా డీసిల్టేషన్ రీచ్‌లకు పర్యావరణ అనుమతులు తీసుకోవాలంటున్నారు. ఆ మేరకు ముందుకు వెళ్తామని ఆయన వివరించారు.





ఈర్లదిన్నె రీచ్ వద్ద తుంగభద్రలో ఎక్స్‌కవేటర్ ద్వారా ఇసుకను తోడుతున్న దృశ్యం (ఫైల్)



అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు: కలెక్టర్



ఇసుక రీచులను పరిశీలిస్తున్న కలెక్టర్

సి.బెళగల్, మే 20: అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జి.సృజన అన్నారు. మండలంలోని ఈర్లదిన్నె, శింగవరం, ముడుమాల, పల్దొదొడ్డి గ్రామాల్లోని ఇసుక రీచులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. మండలంలోని తహసీల్దార్, సీఐ, ఎస్ఐ, మైనింగ్ అధికారులు చొరవ తీసుకుని ఇసుక రీచ్‌లు ఉన్న దగ్గర సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండల స్థాయి అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నదితీర ప్రాంతాల నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్, లారీలను తప్పనిసరిగా పరిశీలించాల్సిన బాధ్యత స్థానిక రెవెన్యూ, పోలీసులదే అన్నారు. అలాగే మండలంలోని పంచాయతీలలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని చెప్పారు. కలెక్టర్ వెంట ట్రైనింగ్ కలెక్టర్ కళ్యాణి, ఆర్డీవో శేషిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్, మైనింగ్ అధికారులు, తహసీల్దార్ అనుపమ ఉన్నారు.

పెండింగ్ పనుల పూర్తికి చర్యలు: పీఆర్ ఎస్ఈ

కర్నూలు(న్యూసిటీ), మే 20: ఎన్నికల కోడ్ అమలుకు ముందు ఆమోదం పొంది. పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు పీఆర్ ఎస్ఈ కే సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం విశ్వేశ్వరయ్య భవన్‌లోని ఆయన చాంబర్‌లో మాట్లాడుతూ ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన కింద జిల్లాలో 6 పనులు రూ.35.54 కోట్లతో ప్రారంభించామన్నారు. ఇందులో నాలుగు రోడ్లు, రెండు బ్రిడ్జిల నిర్మాణం జరుగుతుందన్నారు. అదేవిధంగా నాబార్డు కింద రూ.183.23 కోట్లతో గ్రామీణ ప్రాంతాలలో 247 కి.మీ. మేర 38 రోడ్ల పనులు ప్రారంభించామని వివరించారు. ఇప్పటి వరకు పారుమంచాల-మిద్దూరు, కేజీ రోడ్డు-వెలుగోడు, డోన్, రాయలచెరువు- పెద్దపాయ, డోన్-గోవర్ధనగిరి, గుడిపాడు- పీఆర్ పల్లె రోడ్లు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు.

మందగించిన క్రయ విక్రయాలు

కర్నూలు(అగ్రికల్చర్), మే 20: ఖరీఫ్‌తోపాటు రబీలో నామమాత్రంగా పంట ఉత్పత్తులు రైతుల చేతికి అందడంతో ఆయా మార్కెట్ యార్డుల్లో క్రయ విక్రయాలు అంతంతమాత్రంగా జరుగుతున్నాయి. సోమవారం కర్నూలు మార్కెట్ యార్డులో వేరుశనగ కాయలు 62 క్వింటాళ్లు, పూల విత్తనాలు ఒక క్వింటం, ఆముదాలు 13 క్వింటాళ్లు రాగా.. వాము పూర్తిగా రాలేదు. మొక్కజొన్నలు 25 క్వింటాళ్లు, కందులు 63 క్వింటాళ్లు, శనగలు 19 క్వింటాళ్లు మాత్రమే వచ్చాయి. ప్రతి రోజూ పెద్ద ఎత్తున విక్రయానికి వచ్చే ఉల్లిగడ్డలు పూర్తిగా తగ్గిపోయాయి. సోమవారం కనీసం ఒక క్వింటం కూడా యార్డుకు రాలేదు. ఎండు మిరప కాయలు 104 క్వింటాళ్లు, కొర్రలు 77 క్వింటాళ్లు, మినుములు 9 క్వింటాళ్లు మాత్రమే వచ్చాయి. సోయాబీన్ ఒక క్వింటం కూడా విక్రయానికి రాలేదు. కర్నూలు మార్కెట్ యార్డులో విరామం లేకుండా 12 రకాల పంట ఉత్పత్తులను రైతులు విక్రయానికి తీసుకువస్తారు. ఈ సంవత్సరం మాత్రమే పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలు పూర్తిగా మందగించాయి. ఆగస్టు నెలలో ఉల్లిగడ్డలు విక్రయానికి వచ్చే అవకాశం ఉందని, అప్పటి దాకా తమకు సెస్సు ఆదాయం కూడా తక్కువగా ఉంటుందని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు తెలిపారు.

జంతు సంరక్షణ పర్యవేక్షకుడిగా ఆదోని డీఎస్పీ



కర్నూలు, మే 20: జంతు సంరక్షణకు సంబంధించి ప్రత్యేకు పర్యవేక్షకుని అధికారిగా ఆదోని డీఎస్పీ శివనారాయణ స్వామిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జంతు సంక్షేమ బోర్డు జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించి జంతువుల అక్రమ రవాణా, జంతువుల వధను నిరోధించడానికి జిల్లాకు ఒక నోడల్ అధికారిని నియమించారు. జంతువుల అక్రమ రవాణా, గోవధ విషయంలో హైకోర్టు ఆదేశాలు, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకునేందుకు ఈ నియామకం చేపట్టింది. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఆయా నోడల్ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా డీజీపీ కార్యాలయం నుంచి ఎస్పీ కార్యాలయానికి ఆదేశాలు వచ్చాయి.

స్ట్రాంగ్ రూంల వద్ద మూడంచెల భద్రత

ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీనివాసులు

పాణ్యం, మే 20 : మండలంలోని నెరవాడ సమీపంలోని ఆర్జీఎం, శాంతిరాం, ఇంజనీరింగ్ పార్మసీ కళాశాలల్లో భద్రపర్చిన పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంల స్ట్రాంగ్ రూంల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వారు స్ట్రాంగ్ రూంలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ కళాశాలల వద్ద కేంద్ర బలగాలు, ఆర్మ్ రిజర్వ్, సివిల్ పోలీసులతో మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల స్ట్రాంగ్ రూంల తలుపులకు అదనపు భద్రత నిమిత్తం ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పాణ్యం సీఐ నల్లప్ప, ఎస్ఐ అశోక్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాల పుటేజీని పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి, ఎస్పీ

ఆహారం విషతుల్యం..

- 18 మందికి అస్వస్థత... ● ఇస్వీలో వైద్యబృందం పర్యటన




రోగులను పరామర్శిస్తున్న వైద్య సిబ్బంది

ఆదోని రూరల్, మే 20 : ఆదోని మండలం ఇస్వీ గ్రామంలో ఆహారం విషతుల్యం కావడంతో మూడు కుటుంబాలకు చెందిన 18 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గ్రామానికి చెందిన రోగెమ్మ కొంత కాలంగా హైద్రాబాదులో నివాసం ఉంటోంది. గడిచిన శనివారం దస్తగిరి స్వామి ఉరుసుకు వచ్చిన రోగెమ్మ తన ఇంట్లో గ్యార్మీ నిర్వహించింది. మిగిలిన ఆహారాన్ని ఆదివారం రోగెమ్మ కుటుంబ సభ్యులు తిన్నారు. కొంత పక్కనే ఉన్న మరో రెండు కుటుంబాలకు పంచి పెట్టారు. ఆ ఆహారం తిన్న మూడు కుటుంబాలకు చెందిన 18మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. సోమవారం జిల్లా వైద్య సిబ్బంది చలపతి, వేణుగోపాల్, ఆదోని డిప్యూటీ డీఎం అండ్‌హెచ్ఓ సత్యవతి, డాక్టర్ ఇమ్రాన్, ఎంపీహెచ్ఈఓ లక్ష్మీనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ నాగ మల్లయ్య రోగులను పరామర్శించారు. 12మంది డిశ్చార్జి అయ్యారని, మిగిలినవారు చికిత్స పొందుతున్నారని వైద్యులు తెలిపారు.

రాయలసీమలో ఆయుధ ఉత్పత్తి

- బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారథి



బోర్డు సభ్యులతో డాక్టర్ పార్థసారథి

కర్నూలు, మే 20 (ఆంధ్రజ్యోతి): భారత రక్షణ శాఖకు అవసరమైన ఆయుధాల ఉత్పత్తిలో రాయలసీమ కీలక భూమిక పోషించనుందని ఆదోని టీడీపీ కూటమి బీజేపీ అభ్యర్థి, భారత రక్షణ శాఖకు పరిధిలోని భారత ఎలక్ట్రానిక్ లిమిటెడ్ (భారత ప్రభుత్వ రంగ సంస్థ) డైరెక్టరు డాక్టర్ పార్థసారథి అన్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం డార్జిలింగ్‌లో జరిగిన భారత ఎలక్ట్రానిక్ లిమిటెడ్ బోర్డు సమావేశానికి ఆయన హాజరయ్యారు. మూడు రోజులపాటు జరిగిన సమావేశంలో దేశంలో భారత రక్షణ శాఖ చేపట్టే ఆయుధ తయారీ, నూతన ఆయుధ కర్మాగారాల ఏర్పాటుపై ప్రధానంగా చర్చించినట్లు ఆయన సోమవారం ఆంధ్రజ్యోతికి వివరించారు. రాబోయే రోజుల్లో రాయలసీమ భారత రక్షణ శాఖ ఆయుధ తయారీలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన రెండు ఆయుధ కర్మాగారాలపై చర్చించినట్లు ఆయన తెలిపారు. మచిలీపట్నంలో ఓ పరిశ్రమ ఇప్పటికే అన్ని దశలు పూర్తి చేసుకుందని, త్వరలో ప్రధాని చేతులు మీదుగా ప్రారంభించాల్సి ఉందన్నారు. అనంతపురం జిల్లాలో కియో కార్ల తయారీ పరిశ్రమకు ఎదురుగా పాలసముద్రం వద్ద డిఫెన్స్ ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు టీడీపీ ప్రభుత్వంలో ఆనాటి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రధాని మోదీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో రక్షణ శాఖ పటిష్టమైన శక్తిగా ఎదిగిందని, ప్రపంచ దేశాలకు ఆయుధాలు ఎగుమతి చేసే స్థాయికి చేరుకున్నామని వివరించారు.

శివాలయంలో చోరీ

ఆత్మకూరు, మే 20: ఆత్మకూరు పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో గల ఆత్మలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అర్ధ రాత్రి చోరీ జరిగింది. ఆలయం తలుపులకు ఉన్న తాళాలను ధ్వంసం చేసి ఆలయంలోకి ప్రవేశించి హుండీలో ఉన్న సొత్తును ఎత్తుకెళ్లారని అర్చకుడు మధుసూదన్ శర్మ తెలిపారు. దుండగులు ఆలయంలో ఉన్న బీరువాను పెకిలించి అందులోని వెండి సామగ్రిని చోరీ చేశారు. సోమవారం తెల్లవారుజామున అటుగా వెళ్లిన భక్తులు ఆలయంలో చోరీ జరిగినట్లు గుర్తించి అర్చకుడికి సమాచారం ఇచ్చారు. ఆయన ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఆత్మకూరు అర్బన్ సీఐ లక్ష్మీనారాయణ తమ సిబ్బందితో అక్కడికి వెళ్లి వివరాలు సేకరించారు. అర్చకుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా వుంటే హుండీలో సుమారు 15వేల వరకు భక్తులు వేసిన విరాళాలు పోయి ఉండవచ్చునని ఆలయ నిర్వాహకులు భావిస్తున్నారు.

సప్లిమెంటరీ పరీక్షలపై సమీక్ష

కర్నూలు(కలెక్టరేట్), మే 20: జిల్లాలోని ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు, ఎస్ఎస్‌సీ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారులు కె.మధుసూదన్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ, ఎస్ఎస్‌సీ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి నిర్వహించే ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలో 35 సెంటర్లలో మొదటి సంవత్సరానికి సంబంధించి 15,981 మంది, రెండో సంవత్సరానికి సంబంధించి 22 సెంటర్లలో 6,962 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ఆర్ఐవో గురువయ్యశెట్టి, డీవీఈవో సమీర్‌పాషా, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పర్ స్కూల్స్ చంద్రకాంత్, కమిటీ సభ్యులు పరమేశ్వరరెడ్డి, లాలెప్ప, ప్రభు, మున్సిపల్ డీఈ రవికుమార్, పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురి అరెస్టు

ఆళ్లగడ్డ, మే20: మాజీ మంత్రి అఖిలప్రియ బాడీ గార్డ్ నిఖిల్ హత్యాయత్నం కేసులో మరో ముగ్గురిని పోలీసు అధికారులు అరెస్టు చేసినట్లు తెలిసింది. చంద్ర, మాలిక్‌బాషా, నరసింహ అనే నిందితులను హైదరాబాదులో అరెస్టు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ హత్యాయత్నం కేసులో ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ఇందులో ఈనెల 18వ తేదీన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. మరో ముగ్గురిని అరెస్టు చేయడంతో మొత్తం ఐదుగురిని అరెస్టు చేసినట్లైంది. ఇంకా ఏవీ సుబ్బారెడ్డి, చంటి అనే ఇద్దరు అరెస్టు కావాల్సి ఉంది. ఈ విషయాలను ధృవీకరించేందుకు ఆళ్లగడ్డ పోలీసు అధికారులు అందుబాటులో లేరు.

కూలీల హాజరు పెంచండి: పీడీ



పనులను పరిశీలిస్తున్న పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

కోడుమూరు(రూరల్), మే 20: ఉపాధి పనుల్లో కూలీల హాజరు పెంచాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని అమడ గుంట్లలో సోమవారం ఉదయం పంట కాలువ పూడిక తీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరు తనిఖీ చేశారు. కూలీల హాజరు పెంచడంలో పురోగతి సాధించకుంటే చర్యలు తప్పవని ఫీల్డ్ అసిస్టెంట్‌ను హెచ్చరించారు. అనంతరం ఉపాధి పథకం కింద సాగు చేసిన నేరేడు పండ్ల మొక్కలను పరిశీలించి తగు సూచనలిచ్చారు. పండ్ల తోటల పెంపకానికి రైతులు ముందుకు రావాలని ఆయన కోరారు. ఆయన వెంట ఏపీవో మోదీన్‌బాషా, ఈసీ వెంకటేశ్వర్లు, టీఏ, ఎఫ్ఏ ఉన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

సి.బెళగల్, మే 20: ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో లక్ష్మన్న సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో టెక్నికల్ అసిస్టెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో ఉపాధి పనులకు వెళ్లే కూలీలందరికీ తమ వ్యక్తిగత ఖాతాలలో కూలీలు జమ అయ్యాయని అన్నారు. అలాగే జాబు కార్డు లేనివారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే సాగునీరు ఉన్న సన్నకారు రైతులు పండ్ల తోటలను పెంచుకోవాలన్నారు. ఈసమావేశంలో టెక్నికల్, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం మంజూరు

సి.బెళగల్, మే 20: మండలంలో పత్తి, వేరుశేనగ, కంది, సజ్జ, కొర, ఆముదం, వరి పంటలు వేసి నష్టపోయిన రైతులకు రూ.12 వేల కోట్ల 55 లక్షల నష్టపరిహారం మంజూరైనట్లు మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్ తెలిపారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ రికార్డులలో పేర్లు నమోదైన ప్రతి రైతుకు తప్పనిసరి తమ వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలలో డబ్బులు జమ అవుతా యన్నారు.

సుందరయ్య ఆశయాలను కొనసాగిద్దాం

కర్నూలు(న్యూసిటీ), మే 20: పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగిద్దామని సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.నరసింహులు అన్నారు. సోమవారం శ్రీరామ్‌నగర్ శ్రీచైతన్య స్కూల్ వద్ద సుందరయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి 39వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య స్వాతంత్ర ఉద్యమంలో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.శేషం, కేవీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కే.ఈశ్వరయ్య, విశ్రాంత ఉద్యోగులు ఏ.వెంకటరమణ, జి.రత్నం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

కర్నూలు(న్యూసిటీ), మే 20: ఈ నెల 30న జరిగే సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజి బాబు పిలుపునిచ్చారు. సోమవారం కేకే భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఐటీయూ కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్. నరసింహులు, సాయిబాబా, గోపాల్, టి.రాముడు, సుధాకరప్ప పాల్గొన్నారు.

23న పూల శంకరయ్య ఆరాధనోత్సవం

కల్లూరు, మే 20: కల్లూరు మండలం పందిపాడు గ్రామంలో ఈనెల 23న పూల శంకరయ్యతాత 47వ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తెలిపారు. ఈ మేరకు ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని పందిపాడు గ్రామంలోని శివన్నతోటలో పూల హనుమన్న బ్రదర్స్ ఆధ్వర్యంలో బండలాగు పోటీలు జరుగుతాయన్నారు. మొదటి బహుమతి రూ.30వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.15వేలు, నాలుగో బహుమతి రూ.10వేలు, ఐదో బహుమతి రూ.5వేలు అందిస్తామని, ఈ సందర్భంగా చెక్క భజన, నందికోలాసేవా నిర్వహిస్తామని వారు తెలిపారు.

నేడు జిల్లా పవర్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), మే 20: స్థానిక డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో మంగళవారం జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పవర్ లిఫ్టింగ్ అధ్యక్షుడు బి. వేణుగోపాల్ సోమవారం తెలిపారు. ఈ పోటీలకు సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ మాస్టర్స్ విభాగంలో జరుగుతాయన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు మంగళగిరి జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 9505157553 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కర్నూలు, మే 20: నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో డీ-మార్ట్ సమీపంలో చెన్నమ్మ సర్కిల్ వైపు వెళ్లే సర్వీసు రోడ్డుపై జరిగిన ప్రమాదంలో గాయపడిన ధనురాజ్ (40) చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానిక సమతానగర్‌కు చెందిన ధనురాజ్ ఈనెల 13న తన మోటారు సైకిల్‌పై ఓటు వేసి అనంతరం పనికి వెళ్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. సర్వీసు రోడ్డుపై వెళ్తుండగా.. ప్రమాదవశాత్తు మోటారు సైకిల్ అదుపు తప్పి కింద పడింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ ధనురాజ్ సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య జానకి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకరయ్య తెలిపారు.

'దళిత కాలనీల్లో వైద్య సేవలు అందించాలి'



మాట్లాడుతున్న స్థాణుమలయన్

కర్నూలు(కల్చరల్), మే 20: హిందుత్వ భావాలున్న వైద్యులు దళిత కాలనీల్లో ఉచిత వైద్య సేవలు అందించేందుకు ముందుకు రావాలని వీహెచ్‌పీ కేంద్రీయ సంయుక్త మహా మంత్రి స్థాణుమలయన్ పిలుపునిచ్చారు. మంగళ వారం నగరంలో గాయత్రి ఎస్టేట్‌లోని మోడ్రన్ ఐ హాస్పిటల్ అండ్ రిసెర్చ్ సెంటర్‌లో, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హిందూ వైద్య బంధువుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలో ప్రాణం పోయగల సమర్థత ఉన్న ఏకైక వృత్తి వైద్య వృత్తి మాత్రమేనని, ప్రతి వైద్యుడు ఒక భగవంతునితో సమానమని చెప్పారు. నేడు వైద్యం చాలా ఖరీదైన సేవగా మారినందున, పేదలు వైద్యం చేయించుకునేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మోడ్రన్ ఐ హాస్పిటల్ అధినేత డాక్టర్ రాజశేఖర్, వీహెచ్‌పీ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, గోరంట్ల రమణ, జిల్లా కార్యదర్శి భానుప్రకాశ్, ఆర్ ఎస్ఎస్ నగర అధ్యక్షుడు వాసురెడ్డి పాల్గొన్నారు.

సాగుకు సిద్ధం

● విత్తనాలు వేసేందుకు రైతులు సన్నద్ధం
● అన్నదాతలను వెంటాడుతున్న కరువు భయం



దుక్కి దున్నుతున్న రైతన్న

ఓర్వకల్లు, మే 20: గత ఏడాది వర్షాలు లేక, తెగుళ్ల సోకి పత్తి తదితర పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈసారైనా నమ్ముకున్న భూమి గట్టెక్కించకపోదా? అనే ఆశతో రైతులు మరోసారి పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. మండలంలో పత్తి 800 హెక్టార్లు, కంది 200 హెక్టార్లు, ఆముదం 100 హెక్టార్లు, మొక్కజొన్న 1000 హెక్టార్లు, మినుములు 100 హెక్టార్లు, వేరుశనగ 500 హెక్టార్లులో సాగు చేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. అయితే.. వర్షం మొదలవడంతో రైతులు తమ పొలాలను దున్ని దుక్కి చేసుకుంటూ బిజీ బిజీ అయ్యారు. గత ఏడాది వేసిన పంటలకు దిగుబడి చేతికి రాకపోవడంతో రైతులు అప్పుల వలయంలో కూరుకుపోయారు. ప్రభుత్వం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించినప్పటికీ చాలా మంది రైతులకు నష్టపరిహారం అందక ఆర్‌బీకే కేంద్రాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాదైనా తమ తలరాతలు మారుతాయని అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాల్సిన అవసరం ఏర్పడింది.

వ్యవసాయ పనుల్లో రైతన్న బిజీ.. బిజీ

గూడూరు: తొలకరి చినుకులతో రైతన్న వ్యవసాయ పనుల్లో బిజి బిజి అయ్యారు. తొలకరి వానలతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న వానలతో రైతన్నలు పొలం బాట పట్టారు. పంట పొలాలను దుక్కి దున్నే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. గత ఏడాది సరైనా వానలు కురువక వేసిన పంటలు చేతికందక రైతులు ఇబ్బందులు పడ్డారు. కనీసం ఈ ఏడాదైనా వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని రైతులు కోరుతున్నారు.

పొలాన్ని సిద్ధం చేసుకున్నాం



గత ఏడాది పదెకరాల్లో పత్తి పంటను సాగు చేశాం. అయితే.. పంటపై లక్షల పెట్టుబడి పెట్టాం. దీంతో తెగుళ్లతో దిగుబడి రాక తీవ్రంగా నష్టపోయాం. పత్తి పంట చేతికొచ్చే సమయానికి అంతుపట్టని తెగుళ్లు సోకడం, చెట్టుకున్న కాయ రాలిపోవడం, గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయాం. పంటలు సాగు చేసేందుకు పొలాన్ని సిద్ధం చేశాం.

\- నజీర్, రైతు

నష్టాలే అధికం



గత ఏడాది వేసిన పంటలు దెబ్బతిని అప్పులే మిగిలాయి. ఏ పంట కూడా దిగుబడి రాలేదు. రైతులు నష్టాల వలయంలో కూరుకుపోయారు. ఈ ఏడాదైనా మా తలరాతలు మారుతాయన్న ఉద్దేశంతో పొలం పనులను సిద్ధం చేసుకుని విత్తనాలు వేసేందుకు సన్నద్ధమయ్యాం.

\- గడేకారి శేఖర్, రైతు

వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య

కర్నూలు, మే 20: మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. సీఐ మురళీధర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో గౌతమినగర్‌లో నివాసముండే ప్రకాష్ నాయక్(39) తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన బోర్‌వెల్ బండికి ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. గత కొద్ది కాలంగా బెట్టింగ్‌లు ఆడడం, లోన్ యాప్స్‌లో లోన్లు తీసుకోవడంతో అప్పులు పెరిగాయి. కొద్ది కాలం కింద వెల్డింగ్ షాపు పెట్టి నష్టాలు చవి చూశాడు. దీంతో అప్పు తీర్చలేక ఆయన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య సరళా బాయి, ఒక కొడుకు, కూతురు సంతానం ఉన్నారు.

● స్థానిక గణేష్‌నగర్ ఆటోనగర్ సమీపంలో నివాసం ఉంటున్న చాకలి రాము (35) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వడ్డెమాను గ్రామానికి చెందిన రాము భార్య ఎల్లమ్మతో కలిసి బతుకుదెరువు కోసం కర్నూలు వచ్చారు. చాకలి పని చేసుకుంటూ జీవనం చేస్తున్నాడు. మద్యానికి బానిస కావడంతో తరచూ భార్యభర్తల మధ్య గొడవలు జరిగేవి. సోమవారం కూడా మద్యం తాగడానికి వెళ్తుండగా.. భార్య మందలించి పనికి వెళ్లిపోయింది. పని ముగించుకుని ఇంటికి వచ్చి చూస్తే ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చిన్నారికి అరుదైన శస్త్ర చికిత్స

కర్నూలు(హాస్పిటల్), మే 20: సాధారణంగా అందరికీ రెండు మూత్ర పిండాలు ఉంటాయి. కానీ జిల్లాకు చెందిన మూడేళ్ల బాలికకు అత్యంత అరుదైన సమస్య ఏర్పడింది. బాలిక ఎడమ వైపు ఉండాల్సిన కిడ్నీ రెండుగా విడిపోయింది. అందులో ఒకటిపైన, మరొకటి కింద ఉన్నాయి. మామూలుగా కింద భాగం 55 శాతం పని చేస్తుండగా.. పైభాగం 15 శాతం మాత్రం పని చేస్తుంది. దీంతో బాలిక యుట్రల్ బ్లాక్ అయి కిడ్నీ వాపు వచ్చింది. దీంతో జ్వరం రావడం, నియంత్రణ లేకుండా మూత్ర విసర్జన సమస్యలు తలెత్తాయి. తల్లిదండ్రులు బాలికను కర్నూలు కిమ్స్ ఆసుపత్రిలో తీసుకుని రాగా యురాలజిస్టు, ల్యాప్రోస్కోపిక్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డా.వై. మనోజ్ కుమార్ పరీక్షలు నిర్వహించారు. చిన్నారికి ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలో శస్త్రచికిత్స చేసి పాడైపోయిన మూత్రపిండాన్ని మాత్రం డా. మనోజ్ కుమార్ తొలగించారు. ఒక దానితో ఒకటి అతుక్కొని ఉన్న రెండు కిడ్నీలను వేరు చేశారు పై కిడ్నీ తీసేటప్పుడు కింద కిడ్నీకి ప్రమాదం జరగకుండా తొలగించారు. ప్రస్తుతం మూత్ర పిండం బాగా పని చేస్తుందని బాలిక పూర్తిగా కోలుకుందని డా.మనోజ్ కుమార్ వివరించారు.

23న అన్నమాచార్యుల జయంతి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న గోదా గోకులం ప్రతినిధులు

కర్నూలు(కల్చరల్), మే 20: తొలి తెలుగు వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యుల 616వ జయంతి వేడుకలను గురువారం నగర శివారు మామి దాలపాడులోని గోదా గోకులం క్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజగుప్త తెలిపారు. సోమవారం గోకులంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల వివరాలు తెలిపే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరాజ గుప్త మాట్లాడుతూ అన్నమాచార్యుల జయంతి సందర్భంగా గోకులంలో గురువారం ఉదయం 9 గంటలకు నగర సంకీర్తన, 9.30 గంటలకు అన్నమాచార్యులకు అర్చన, పూజా కార్యక్రమం, 10 గంటలకు అన్నమాచార్య కీర్తనల బృందగానం, ఉదయం 11.30 గంటలకు అన్నమయ్య చరిత్ర హరికథా మృతం, మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నమయ్యకు నృత్య నీరాజనం (శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు), మధ్యాహ్నం ఒంటి గంటకు మహాప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గోకులం సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, పెరుమాళ్ల బాలసుధాకర్, పి.వెంకట సుబ్రహ్మణ్యం, వేముల జనార్ధన్, ఇ.పుల్లయ్య, సీహెచ్ వీరయ్య పాల్గొన్నారు.

బీఆర్క్ పరీక్షల్లో ప్రతిభ

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 20: చిన్నటేకూరు సాంఘిక సంక్షేమ గురుకుల ఐఐటీ-మెడికల్ అకాడమీకి చెందిన విద్యార్థులు ఎన్‌టీఏ నిర్వహించిన బీఆర్క్ పరీక్షల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చినట్లు అకాడమీ డైరెక్టర్ రామసుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. ఆలిండియా స్థాయిలో గార్లపాటి సూర్యతేజ 51వ ర్యాంకు, భానుసుగుణ 123వ ర్యాంకు, కె.లక్ష్మీనరసింహ 412వ ర్యాంకు సాధించినట్లు ఆయన తెలిపారు. అందుకు కృషి చేసిన అధ్యాపకులను ఆయన అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన విద్యార్థులకు జేఈఈ, నీట్ ప్రవేశ పరీక్షలకు రెండేళ్ల ఇంటర్మీడియట్‌తోపాటు ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు: ఏవో



విత్తన దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏవో

సి.బెళగల్, మే 20: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో మల్లేష్‌కుమార్ విత్తన దుకాణ యజమానులను హెచ్చరించారు. సోమవారం మండల వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రమైన సి. బెళగల్‌తోపాటు గ్రామాల్లోని సీడ్స్, ఫర్టిలైజర్, దుకాణాలను తనిఖీ చేశామన్నారు. అలాగే విత్తన దుకాణం యజమానులు రైతులకు విక్రయించే ప్రతి దానికి బిల్లులు ఇవ్వాలన్నారు.

జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి

ఓర్వకల్లు, మే 20: మండల కేంద్రమైన ఓర్వకల్లులో సోమవారం సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఏర్పాటు చేసిన సమావేశానికి టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. జూనియర్ ఎన్టీఆర్ మంచి డ్యాన్సర్, నటుడు అని, మరెన్నో సూపర్ హిట్ చిత్రాలు తీసి అభిమానులను ఆకట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు, అశోక్, రవి, వేణుగోపాల్ రెడ్డి, అల్లాబాబు, దాసు, యాసిన్‌బాషా పాల్గొన్నారు.

ఘనంగా మహానందీశ్వరుడి పల్లకి సేవ

మహానంది, మే 20: మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పరమ శివుడు అయిన మహానందీశ్వరునికి పల్లకిసేవను భక్తుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో ప్రత్యేక పల్లకిపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆశీనులు గావించారు. వేదపండితులు పల్లకి ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



పల్లకిసేవలో పాల్గొన్న భక్తులు

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించిన మహిళలు



ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన పందిపాడు మహిళలు, ప్రజలు

కల్లూరు, మే 20: కార్పొరేషన్ పరిధిలోని కల్లూరు అర్బన్ 28వ వార్డు పందిపాడు గ్రామానికి ప్రజలు, మహిళలు తాగునీటి సమస్య పరిష్కరించాలని రోడ్డెక్కారు. సోమవారం రాత్రి మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపైకి వచ్చి మూడు రోజులగా తాగునీటి సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థలో పందిపాడు గ్రామం విలీనం అయి పెద్ద మొత్తంలో పన్నులు బాదుతున్నా కనీసం ప్రజలకు తాగునీరు కూడా అందించలేని దౌర్భాగ్యస్థితిలో అధికారులు పని చేస్తున్నారని మండిపడ్డారు. హంద్రీనది బోరు ద్వారా నీటి సరఫరా అందించే వాటర్‌వర్క్స్ అధికారులు మూడు రోజుల క్రితం మోటర్ చెడిపోవడంతో నీరు వదలడం లేదన్నారు. అందుకు ప్రత్యామ్నాయంగా ట్యాంకర్లతో గ్రామానికి నీటి సరఫరా చేస్తున్న అధికారులు రెండు కాలనీల్లో మాత్రం ట్యాంకర్లను పంపలేదని ప్రజలు, మహిళలు ఆరోపించారు. గ్రామంలో అన్నీ వాడలు, కాలనీలను అధికారులు ఒకే విధంగా కాకుండా వేరు చేసి పార్టీలను ఆపాదిస్తూ నీరు అందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల తాగునీటి సమస్యలపై వాటర్‌వర్క్స్ అధికారులకు సమాచారం ఇచ్చినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా రన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే గ్రామానికి తాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

'ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'



డీఈవోకు వినతి పత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 20: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యా శాఖ అధికారి శామ్యూల్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప, కార్యదర్శి అబ్దుల్లా మాట్లాడుతూ పాఠశాల యజమాన్యాలు పెద్ద పెద్ద హోర్డింగులు, రంగు రంగులతో కరపత్రాలు పంపిణీ చేస్తూ తల్లిదండ్రులను ఆకట్టుకుంటూ అడ్మిషన్లు చేసుకుంటున్నట్లు వారు వివరించారు. తల్లిదండ్రుల నుంచి ఫీజుల పేరుతో అధిక మొత్తాలను వసూలు చేస్తున్నారని ఆరోపించారు. డీఈవోకు వినతిపత్రం సమర్పించిన వారిలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి సాయి ఉదయ్, కమిటీ సభ్యుడు గౌస్ ఉన్నారు.

బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న సిబ్బంది

కోడుమూరు(రూరల్), మే 20: కోడుమూరు సెబ్, డీటీఎఫ్ పోలీసుల మూకుమ్మడి దాడిలో భారీగా బెల్లం ఊట ధ్వంసం చేశారు. సెబ్ సీఐ రామాంజనేయులు, డీటీఎఫ్ సీఐ నరసనాయుడు అధ్వర్యంలో సోమవారం వెల్దుర్తి మండలంలోని ఎల్ బండ తండా వద్ద నాటుసారా బట్టీపై దాడి నిర్వహించారు. ఈ దాడుల్లో 1650 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం, 15 నాటుసారా సీజ్ చేసినట్లు సీఐ రామాంజనేయులు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది శంకర్‌నాయక్, గోపాల్ నాయక్, వెంకటరాముడు, కరుణాకర్, షేక్షావలి పాల్గొన్నారు.

వైభవంగా ద్వాదశి వేడుకలు

● నవరత్నాల రథంపై దర్శనమిచ్చిన ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, మే 20: రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు నవరత్నాల స్వర్ణ రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. సోమవారం వైశాఖ ద్వాదశి వేడుకలను పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాల మధ్య నవరత్నాల రథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్టించి పీఠాధిపతి మహా మంగళహారతితో ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. విద్యుత్ కాంతుల మధ్య నవరత్నాల రథం ఊరేగుతుండగా భక్తుల జయధ్వనులతో మఠం ప్రాంగణం మార్మోగింది. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

అలయన్స్ క్లబ్స్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం

కర్నూలు(కల్చరల్), మే 20: అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్, అలయన్స్ క్లబ్ ఆఫ్ గ్రేటర్ కర్నూలు, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో చిన్నారులకు, విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహక సంస్థల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 4-8 ఏళ్ల చిన్నారులకు డ్రాయింగ్, కంప్యూటర్ బేసిక్స్, పేపర్ క్రాఫ్టింగ్ అంశాలలో శిక్షణ ఇస్తామని తెలిపారు. 9-15 ఏళ్ల విద్యార్థులకు సర్టిఫికెట్ కోర్స్ ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్, తెలుగు డీటీపీ, 15 ఏళ్లు పైబడి వారికి ఫొటోషాప్, ఆఫీస్ అప్లికేషన్స్, కంప్యూటర్ డేటా ఎంటీ ఆపరేషన్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. 20 రోజుల కాల పరిమితితో ఈ శిక్షణలు ఉంటాయని తెలిపారు. ఆసక్తిగల వారు తమ ఆధార్, పాస్‌పోర్టు ఫొటోలతో ఈనెల 22లోగా నగరంలోని వెంకట రమణకాలనీ మొదటి లైన్‌లో గల నైస్ కంప్యూటర్స్ శిక్షణ కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు సెల్ నెంబర్: 93968 61308ను సంప్రదించాలని సూచించారు.

గగనదీప్ సింగ్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 20: ఏఐఎస్ఎఫ్ రాజస్థాన్ రాష్ట్ర అధ్యక్షుడు గగనదీప్ సింగ్‌పై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ఎఫ్ కర్నూలు శాఖ డిమాండ్ చేసింది. సోమవారం స్థానిక సీఆర్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఏఐ ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న మాట్లాడుతూ గగనదీప్ సింగ్ ఏఐఎస్ఎఫ్ వివిధ హోదాల్లో పని చేశారని తెలిపారు. స్థానిక పోలీసులు ఈ హత్య కేసును చేధించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐ ఎస్ఎఫ్ నగర కోశాధికారి అశోక్, నవనీత్, నూరి, దుర్గన్న, మహబూబ్‌బాషా, షఫి, తరుణ్, వర్ధన్ పాల్గొన్నారు.

ఒత్తిడిని అధిగమించేందుకు యోగా



యోగా చేస్తున్న చిన్నారులు

కర్నూలు(స్పోర్ట్స్), మే 20: ఒత్తిడిని అధిగమించేందుకు విద్యార్థులకు యోగా సాధన ఉపకరిస్తుందని రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాశ్ శెట్టి అన్నారు. సోమవారం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, కర్నూలు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో జోహరాపురంలోని ఇందిరమ్మ కాలనీలో ఉన్న వేసవి యోగా శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. అనంతరం చిన్నారులకు కర్నూలు జిల్లా యోగా సంఘం ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని అందజేశారు.

ఉచిత విద్యను అందించాలి



డీఆర్వోకు వినతి పత్రం ఇస్తున్న జర్నలిస్టులు

కర్నూలు(కలెక్టరేట్), మే 20: జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించాలని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో మధుసూదన్‌రావుకు ఫొటో వీడియో జర్నలిస్టుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మీసాల రామస్వామి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. కార్పొరేట్, ప్రైవేటు ఫీజులను కట్టలేని స్థితిలో ఉన్నారని, వీరికి ఫీజులో రాయితీ కల్పించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో మధుసూదన్ రెడ్డి, జయబాబు, రవి, ఆంజనేయులు, జయన్న ఉన్నారు.

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

రీసర్వే తెచ్చిన తిప్పలు

● సమగ్ర భూసర్వేలో మారిన కొలతలు, రికార్డులు
● వెబ్‌ల్యాండ్‌లో చూపని 1బీ, అడంగల్ వివరాలు
● బ్యాంకు లోన్ రెన్యూవల్ కోసం రైతుల అగచాట్లు
● మరోసారి సర్వే చేస్తే తప్ప సమస్యను పరిష్కరించలేమంటున్న అధికారులు



పత్తికొండ, మే 20 : భూ సమస్యల పరిష్కారం పేరిట వైసీపీ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూసర్వే కార్యక్రమం రైతులకు కొత్త సమస్యను తెచ్చిపెట్టింది. కొత్తగాచేసిన సర్వేలో కొందరు రైతుల భూవిస్తీర్ణం కొలతలు తారుమారుకావడంతో అధికారులకు ఫిర్యాదులు చేసుకున్నారు. దీంతో ఆ భూముల వివరాలను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయకుండా అధికారులు పెండింగ్‌లో ఉంచారు. దీంతో రుణాల షెడ్యూల్‌కు వెళ్లాలంటే తమరికార్డులు కనిపించక ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆశ్రయించినా మరోసారి ఆ భూములను రీసర్వే చేస్తే తప్ప సమస్యను పరిష్కరించలేమని చావుకబురు చల్లగా చెబుతున్నారు. దీంతో తమభూములకు సంబంధించి రుణాల రీషెడ్యూల్ పరిస్థితి ఏమిటో అర్థంగాక రైతులు రీసర్వే తెచ్చిన తిప్పలపై మండిపడుతున్నారు.

సర్వేనంబర్ కాకుండా ఎల్‌పీవో నంబర్

బ్రిటిష్ కాలం నుంచి అందుబాటులో ఉన్న సర్వేనంబర్ల విధానాన్ని మార్చుచేసి ఎల్‌పీవో నంబర్ విధానం అందుబాటులోకి తేవడం ముఖ్యఉద్దేశంగా సమగ్ర భూసర్వేను వైసీపీ ప్రభుత్వం చేపట్టింది. అందులో భాగంగా రీసర్వేను డ్రోన్ సర్వే, ఏరియల్ సర్వేద్వారాచేపట్టింది. ఈ రెండు సర్వేలే చేయలేని ప్రాంతంలో డీజీపీఎస్ సర్వేద్వారా భూముల విస్తీర్ణాన్ని కొలిచింది. పత్తికొండ నియోజకవర్గంలో ఎంపిక చేసిన కొన్ని గ్రామాల్లో రీసర్వే పనులు పూర్తిచేసి వెబ్‌ల్యాండ్‌లో ఎల్‌పీవో నంబర్లకింద రికార్డులు నమోదుచేశారు.

కొలతలలో మార్పులు, రికార్డుల మార్పులు..

రీసర్వే నిర్వహించిన గ్రామాలలో పొలాలకు సంబంధించిన రికార్డులలో మార్పులు చోటుచేసుకున్నాయి. కొందరు రైతుల భూవిస్తీర్ణం తక్కువగా మరికొందరి భూవిస్తీర్ణం ఎక్కువగా చూపడంతో తమ భూవిస్తీర్ణం సరిగా చూపాలని రైతులు అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో అలాంటి భూముల వివరాలను అధికారులు ఆ భూముల వివరాలను వెబ్‌ల్యాండ్‌లో ఎక్కించకుండా పెండింగ్‌లో పెట్టారు. దీంతో రుణాల రీషెడ్యూల్‌కు వెళ్లాలంటే భూమికి సంబంధించని వివరాలు వెబ్‌ల్యాండ్‌లో కనిపించక రీషెడ్యూల్ చేసుకోలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే అధికారులు మాత్రం వారి సమస్య పరిష్కారం కావాలంటే పెండింగ్ ఉన్న రీసర్వే పూర్తి కావాల్సిందేనని తెల్చిచెబుతున్నారు.

నా భూమి విస్తీర్ణం తక్కువగా చూపారు

మాది తుగ్గలి మండల రాతన గ్రామం. మాకు చక్కరాళ్ల గ్రామ సర్వేనంబర్ 465/2లో 3.70 ఎకరాల భూమి ఉంది. రీసర్వే చేసిన అధికారులు నాకున్న భూమి 2.79 ఎకరాలుగా చూపారు. దీంతో నా భూవిస్తీర్ణం నాకు చూపాలంటూ అధికారులకు ఫిర్యాదు చేశాను. ప్రస్తుతం వెబ్‌ల్యాండ్‌లో నాపేరిట అసలు ఎలాంటి భూమి వివరాలను చూపడం లేదు. బ్యాంకులో రుణం రీషెడ్యూల్ చేసుకోవాలని నెలరోజులుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను. సమస్యను పరిష్కరంచడంలేదు.

- చాంద్‌మియా బాబుసాహెబ్, చక్కరాళ్ల రైతు

మరోసారి రీ సర్వే చేయాల్సిందే

సమగ్ర భూసర్వేలో కొన్నిపొలాల్లో ఇబ్బందులు వచ్చాయి. రైతుల ఫిర్యాదుల మేరకు వాటిని పెండింగ్‌లో ఉంచాం. మరోసారి ఆ భూములలో రీసర్వే చేయాల్సి ఉంది. త్వరలో రీ సర్వేచేసి సమస్యను పరిష్కరిస్తాం. అప్పటి వరకు వారి సమస్యను పరిష్కరించలేం.

- మాధవరాజు, తహసీల్దార్

మా భూములు మాయం చేశారు..



తుగ్గలిలో సర్వేయర్లతో వాగ్వాదానికి దిగిన రైతులు

తుగ్గలి, మే 20 : సోమవారం తుగ్గలి తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్ కార్యాలయం వద్ద మండలంలోని మామళ్ల కుంట, అమీనాబాద్, సూర్యతండా తదితర గ్రామాల రైతులు సర్వేయర్లతో ఘర్షణకు దిగారు. రీసర్వేలో తమ భూములు మాయం చేశారంటూ సర్వేయర్లను నిలదీశారు. "మా భూముల కొలతలు ఎందుకు తగ్గించారు. ఏళ్లతరబడి మా భూముల్లో మేము సాగులో ఉన్నాం. పట్టాదారు పాసు పుస్తకాలు కూడా ఉన్నాయి. ఆన్‌లైన్‌లో మాత్రం ఎందుకు తగ్గించారు అంటూ సర్వేయర్లను చుట్టుముట్టారు.

సర్వే పేరుతో 3.40 ఎకరాలను మాయం చేశారు

నాకు 902, 903 సర్వేల్లో ఐదెకరాల 74 సెంట్లు పొలం ఉంది. అందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్, ఆన్‌లైన్, పట్టాదారు పాసుపుస్తకాలు కూడా ఉన్నాయి. భూసర్వే తర్వాత కేవలం రెండెకరాల 34 సెంట్లు మాత్రమే చూపుతోంది. మిగిలిన 3.40 ఎకరాలను మాయం చేశారు. ఏమి చేయాలో అర్థం కాక కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాం.

- తిమ్మప్ప యాదవ్, మామళ్లకుంట రైతు

డబ్బు తీసుకొని భూమిని మాయం చేశారు

తనకున్న కాస్త పొలంలో బ్యాంకు రుణం తీసుకొని పెట్టుబడులు పెట్టి ఇంటిల్లిపాది కూలీ పనులు చేస్తూ బతుకుతున్నాం. సర్వేయర్లు భూసర్వే పేరుతో ఇతర రైతులతో డబ్బు తీసుకొని నాకున్న సర్వే నెంబర్ 144లో మూడెకరాల పొలాన్ని రికార్డుల్లో లేకుండా మాయం చేశారు. కేవలం 15 సెంట్లు మాత్రమే ఉందని రికార్డుల్లో చూపిస్తున్నారు. బ్యాంకుకు వెళితే.. మీరు రుణం మొత్తం చెల్లించాలని బ్యాంకు అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. ఎలాగైనా నా భూమిని నాకు ఇప్పించండి.. ఏమి చేయాలో అర్థం కాలేదు.

- సునీత, సూర్యతండా, రైతు

మఠం భూములకు రక్షణ కల్పించాలి

ఆదోని టౌన్, మే 20: రాష్ట్రంలోని వివిధ మఠాలకు చెందిన భూములకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని రాష్ట్ర జంగమ హక్కుల పోరాట సమితి నాయకులు ఎండీ బద్రీనాథ్ స్వామి, కన్నె జగదీష్, యడవల్లి మంజునాథ్ డిమాండ్ చేశారు. సోమవారం వీరు మాటాడుతూ అనంతపురం జిల్లాలోని ఉరవకొండలో ఉన్న గవి మఠానికి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలలో దాదాపు 3వేల ఎకరాల వరకు భూములు ఉన్నాయని, ఈ భూములు ఒక్కొక్కటిగా అన్యాక్రాంతం అవుతున్నా దేవదాయ శాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. కంచె చేను మేసినట్టుగా, దేవదాయ శాఖ ఉద్యోగి ఒకరు బళ్లారి జిల్లాలోని మఠం భూమిలో కొంత భాగం తన కుటుంబ సభ్యుల పేరుతో రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం మఠంకు చెందిన భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

వేరుశనగ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి

తుగ్గలి, మే 20: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే వేరుశనగ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పవన్ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆయన రైతులతో మాట్లాడుతూ మండలంలోని అన్ని ఆర్‌బీకే సెంటర్లలో ఆయా ఆర్‌బీకేల పరిధిలో ఉన్న రైతులందరూ వేరుశనగ పంటను సాగు చేసేందుకు నేటి నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే సబ్సిడీ విత్తనాలు అందుతాయన్నారు. మండలానికి 2,650 క్వింటాళ్ల వేరుశనగ మంజూరయ్యాయని తెలిపారు.

అందరికీ ఉపాధి పనులు కల్పిస్తాం

మద్దికెర, మే 20: మండలంలోని వ్యవసాయ కూలీలందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని ఏపీడీ ఫక్కీరప్ప అన్నారు. సోమవారం మద్దికెర గ్రామంలో ఉపాధి పనులు తనిఖీ చేయడమే కాకుండా కొద్దిసేపు ఉపాధి పనులు చేసి కూలీల్లో ఉల్లాసం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్నారని ప్రతి రోజు 6 వేల మందికి పైగా పనులకు వెళ్తున్నారని తెలిపారు. సకాలంలో కూలీలు అందే విధంగా చూస్తామన్నారు. మేటీలు ఉపాధి కూలీలకు పనులు కల్పించడానికి పనులు గుర్తించాలని తెలిపారు. ఉపాధి పనుల్లో ఎలాంటి అవినీతి జరిగినా సహించేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో ఏపీవో నర్సిరెడ్డి, టీఏ సుధాకర్, ఫీల్డ్ అసిస్టెంటు రాజు తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి వెంకప్పస్వామి ఆరాధన ఉత్సవాలు

మద్దికెర, మే 20: కర్ణాటక ప్రాంతం నుంచి వెంకప్పస్వామి తమ మిత్రబృందంతో తలకు కొబ్బరికాయలు కొట్టించుకుంటూ కాలినడకన ఈ ప్రాంతానికి వచ్చారు. మద్దికెర గ్రామానికి 2 కి.మీల దూరంలో పచ్చని చెట్ల మధ్య వెంకప్పస్వామి తల పగలడంతో.. అదే ప్రాంతంలో ఆయన జీవసమాధై ప్రజల చేత పూజలు అందుకుంటున్నారు. మద్దికెర గ్రామ శివారులో వెలసిన మహిమాన్వితుడు వెంకప్పస్వామి ఆరాధన మహోత్సవాలు ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు.

వేసవి శిక్షణా తరగతులు వాయిదా వేయాలి

ఆలూరు, మే 20: సీబీఎస్ఈ సిలబస్ పేరుతో వేసవి సెలవుల్లో శిక్షణ తరగతులు నిర్వహించడం సరైన నిర్ణయం కాదని, తక్షణమే వాయిదా వేయాలని ఎస్టీయూ రాష్ట్ర నాయకులు నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. విద్యాశాఖలో వెకేషన్ శాఖ అయిన ఉపాధ్యాయులను, వెకేషన్ నుంచి దూరం చేసే శిక్షణలను వాయిదా వేయాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని కోరారు. రెండేళ్లుగా పాఠశాల నిర్వాహణ నిధులు మంజూరు కావడం లేదన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వంట ఏజెన్సీలకు కుకింగ్ చార్జీలు పెంచాలన్నారు. పాఠశాలలు తెరిచే నాటికి అవసరమైన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

బాధ్యుల పై చర్యలు తీసుకోవాలి

● బీజేపీ ఆదోని అసెంబ్లీ కో-కన్వీనర్ నాగరాజ్ గౌడ్ డిమాండ్

ఆదోని, మే 20: తాగనీరు కలుషితం కావడంతో పట్టణ పొలిమేరలోని ఇస్వీ గ్రామంలో 40 మందికి పైగా చిన్నారులు అనారోగ్యంపాలు కావడానికి కారకులైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ ఆదోని అసెంబ్లీ కన్వీనర్ నాగరాజ్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సార్వజనిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను బీజేపీ నాయకులు పరామర్శించి ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీరాములుతో కలిసి చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల ప్రజలకు శుద్ధజలం అందించే ఉద్దేశంతో జల్ జీవన్ మిషన్ పథకాన్ని ప్రవేశపెట్టిందని, ప్రతి ఇంటికి శుద్ధి చేసిన తాగునీరు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంతోనే ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయని ఆరోపించారు. జరిగిన సంఘటనపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ముఖేష్, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అంజయ్ కుమార్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, కాశి పాల్గొన్నారు.

ఆరంభమైన బైబిల్ విరామ తరగతులు




చిన్నారులకు బైబిల్ కథలు చెబుతున్న సేవకురాలు

ఆదోని (అగ్రికల్చర్), మే 20: ఆదోని పట్టణంలోని ఎసేడీ కాలనీ, జీరో రోడ్డు సీయోను ప్రార్థన మందిరంలో సోమవారం బైబిల్ విరామ పాఠశాల తరగతులు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆయాగ్రామాల నుంచి చిన్నారులు భారీగా తరలివచ్చారు. దైవ సేవకుడు ఏ తిమోతి మాట్లాడుతూ చిన్ననాటి నుంచే దైవిక జ్ఞానాన్ని అందిస్తే వారు పెద్దవారైనప్పుడు సన్మార్గంలో ఉంటారని తెలిపారు. చిన్నారులకు బైబిల్ కథలు, క్రైస్తవ గీతాలు వంటివి చెప్పారు. ఈనెల 25వ తేదీ వరకు వీబీఎస్ ఉంటుందని తెలిపారు. హైదరాబాద్‌కు చెందున దైవ సేవకురాలు కెనీఆర్ బ్లెస్సితో పాటు సంఘ పెద్దలు రమేష్, సామేల్, జాషువ, రాజ్‌కుమార్, మనోహర్ పాల్గొన్నారు.

23న హుండీ లెక్కింపు

హాలహర్వి, మే 20: గూళ్యం గాదిలింగేశ్వర స్వామి దేవాలయం హుండీ లెక్కింపు నిర్వహిస్తున్నట్లు దేవదాయ శాఖ ఈవో రాధాకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ హాలహర్వి ఎస్సై నరేంద్రతో చర్చించామని, కమిటీ సభ్యులు, గ్రామస్థుల సమక్షంలో లెక్కింపు చేపడతామని పేర్కొన్నారు.

మంత్రాలయంలో 17 రౌండ్లు, 14 టేబుళ్లు
ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు



మంత్రాలయం నియోజకవర్గం ముఖచిత్రం

మంత్రాలయం, మే 20: నియోజకవర్గంలో 17 రౌండ్లలో ఒక్కో రౌండుకు 14 టేబుళ్లపై లెక్కింపు చేపడుతున్నట్లు మంత్రాలయం రిటర్నింగ్ అధికారి మురళి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీధర్‌మూర్తి తెలిపారు. ఈ నెల 13న నియోజకవర్గంలోని 237 పోలింగ్ బూతుల్లో జరిగిన ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీ ఫస్ట్ ఫ్లోర్‌లో ఒక రౌండుకు 14 టేబుళ్లు సిద్ధం చేశామని, ఇందుకు అవసరమైన సిబ్బంది, అధికారులను నియమించామని తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,08,350 మంది ఉండగా.. 1,75,667 ఓట్లు పోలయ్యాయి. జూన్ 4వ తేదీన కర్నూలులో జరిగే కౌంటింగ్‌కు 17 రౌండ్లలో ఒక్కో రౌండుకు 14 టేబుళ్లు, 14 మిషన్లతో లెక్కింపు చేయడం జరుగుతుందని ఆర్వో, ఏఆర్వో తెలిపారు. ఇప్పటికే భద్రతా, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు.

నియోజక వర్గంలో పోలైన మహిళా, పురుషుల ఓట్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు
కోసిగి	23,308	23,313
కౌతాళం	24,699	24,734
మంత్రాలయం	20,155	20,241
పెద్దకడుబూరు	19,654	19,560

కొండెక్కిన కోడి ధర

● మద్దికెరలో రూ.280 ● ఇంకా ధర పెరిగే అవకాశం



మద్దికెర, మే 20: కోడి మాంసం ధర కొండెక్కి కూర్చుంది. మొన్నటి వరకు కిలో రూ.200 నుంచి రూ.220 ఉన్న కోడి మాంసం ధర రూ.280 కు చేరింది. అదనంగా వారం రోజుల్లోనే రూ.60 పెరిగింది. ఎండల తీవ్రతతో గ్రామాల్లో కోళ్ల పెంపకం తగ్గిపోయింది. అదే సమయంలో కోడి పుంజులు చనిపోవడం, ఉత్పత్తి తగ్గిపోవడం, కొనుగోలు పెరగడం, ధరలకు కారణమైంది. మద్దికెర మండలానికి ఎక్కువగా బెంగుళూరు నుంచి కోళ్లు దిగుమతి అవుతుంటాయి. ప్రస్తుతం మండలంలో అంతంత మాత్రంగా సరఫరా ఉండటంతో సుదూర ప్రాంతాల నుంచి కోళ్లు తెప్పించడంతో ధరలు పెరిగాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. ముున్ముందు మరింత ధరలు పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. మటన్ మాంసం కేజీ రూ.700 చేరుకుంది. ధరలు పెరిగి పోవడంతో విక్రయాలు తగ్గిపోతున్నాయని వ్యాపారస్థులు చెబుతున్నారు.

ప్రమాదకరంగా జీడీపీ కుడి, ఎడమ కాలువల గట్లు

● ద్విచక్ర వాహనాలు, కార్లు స్కిడ్ అవుతూప్రమాదాలు
● అధికారులు స్పందించాలి



జీడీపీ కుడి కాలువ దగ్గర బురదమయంగా మారిన రహదారి

గోనెగండ్ల, మే 20: దామోదరం సంజీవయ్య (గాజులదిన్నె) ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల దగ్గర ఉన్నరహదారిపై మట్టి పేరుకు పోవడంతో వాహనదారులకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఇదే దారి వెంట పిల్లిగుండ్ల, నెరుడుప్పల, ఒంటెడుదిన్నె, ఎర్రబాడు, పత్తికొండ, ఈదులదేవర బండ, బీ. సెంటర్, బండగట్టు గ్రామాల ప్రజల రాక పోకలతో ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాజెక్టు కట్టకు వేసిన మన్ను కొట్టుకొచ్చి రహదారిపై నిలుస్తోంది. దీంతో నీటి బురద కారణంగా వాహనాల రాక పోకలకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికీ దాదాపు 15 మంది ద్విచక్రవాహన దారుల వాహనాలు అదుపుతప్పి కింద పడటంతో వాహనదారులు గాయాల పాలైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. అందులో ఇద్దరి కి చేతిఎముకలు విరిగాయి. ఏ మాత్రం వాహనం అదుపుతప్పినా రహదారికి పక్కనే ఉన్న జీడీపీ కాలువలోని నీటిలో పడిపోవాల్సిందే. శుక్రవారం ఉదయం కోడుమూరు నుంచి పత్తికొండకు వెళ్లేకారు బురద కారణంగా అదుపుతప్పి కాలువ గట్టు దగ్గర అదృష్ట వశాత్తు నిలిచిపోయింది. లేక పోతే కాలువలో కారు పడే ప్రమాదం జరిగేది. కుడి,ఎడమ కాలువలకు రక్షణ గోడ కట్టక పోవడంతో రాత్రి పూట మరింత ప్రమాదకరంగా మరింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్



లక్ష్మీపెట సంజీవయ్యనగర్ రోడ్డులో పైకప్పు లేకుండా తెరుచుకున్న మ్యాన్‌హోల్

ఎమ్మిగనూరు టౌన్, మే 20 : ఎమ్మిగనూరు పట్టణంలో యూజీడీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజ్)కింద ఏర్పాటు చేసి మ్యాన్ హోల్స్ ప్రమాదకరంగా మారాయి. దీంతో పట్టణవాసులు నిత్యం ప్రమాదాల బారినపడుతున్నారు. పదేళ్ల క్రితం పట్టణంలో మురుగునీటి యూజీడీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) వ్యవస్థను ప్రారంభించారు. అ పథకం కాస్త నేటికీ పూర్తి కాలేదు. అయితే యూజీడీ పైపు లైనుతో పాటు పలు ప్రాంతాల్లో మ్యాన్ హోల్స్ ప్రధాన రహదారులతో పాటు పలు వీధుల్లో మ్యాన్ హోల్స్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే మ్యాన్ హోల్స్ పై కప్పులను కూడా బిగించారు. ఏళ్లుగడుస్తున్నా యూజీడీ పూర్తి కాకపోవడంతో నిర్వహణ సైతం సక్ర మంగా లేక మ్యాన్ హోల్స్ పైకప్పులు అనేక ప్రాంతాల్లో ధ్వంసమయ్యాయి. దీంతో ఎక్కడబడితే అక్కడ మ్యాన్ హోల్స్ నోళ్లు తెరుచుకున్నాయి. ప్రధానంగా పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనీ ఎల్ఐసీ కార్యాలయం రోడ్డు, సోగనూరు రోడ్డు, లక్ష్మిపెట సంజీవయ్యనగర్ రోడ్డు (పాత శివాలయం), ఈద్గా రోడ్డు, మరి కొన్ని ప్రధాన వీధుల్లోనూ ఇదే పరిస్థితి, వివర్స్ కాలనీలో మరి కొన్ని గుంతలమయం అయ్యాయి. ఈ రోడ్లలో నిత్యం జనసంచారం ఉంటుంది. వాహనదారులు, పాదచారులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. మ్యాన్‌హోల్స్ పైకప్పులు లేకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రధానంగా రాత్రివేళలో అటుగా వచ్చేవారికి మ్యాన్‌హోల్స్ పై కప్పులు కనిపించకపోవడంతో వాటిలో పడి కాళ్లు చేతులు విరిగిన ధాఖలాలు ఉన్నాయి.పైగా వర్షాలు మొదలవడంతో వర్షపు నీరు నిల్వ ఉండడం వలన మ్యాన్ హోల్స్ పైకప్పులు లేనివాటిని గుర్తించడం కష్టం. ఇలాంటి సమయాల్లో ప్రమాదాలు మరింత ఎక్కువగా జరిగే అవకాశం లేకపోలేదు. ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నా మున్సిపల్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండడంపై పట్టణ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎక్కడైతే మ్యాన్‌హోల్స్ పైకప్పులు లేని వాటిని గుర్తించి వాటికి పై కప్పులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వైభవంగా ద్వాదశి వేడుకలు

● నవరత్నాల రథంపై దర్శనమిచ్చిన ప్రహ్లాదరాయలు



నవరత్నాల స్వర్ణ రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, మే 20: రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు నవరత్నాల స్వర్ణ రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. సోమవారం వైశాఖ ద్వాదశి వేడుకలను పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య నవరత్నాల రథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్టించి పీఠాధిపతి మహా మంగళహారతితో ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. విద్యుత్ కాంతుల మధ్య నవరత్నాల రథం ఊరేగుతుండగా భక్తుల జయధ్వనులతో మఠం ప్రాంగణం మార్మోగింది. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

మండలానికి సబ్సిడీ విత్తనాలు మంజూరు

మంత్రాలయం, మే 20: మంత్రాలయం మండలంలోని 20 గ్రామ పంచాయతీలకు సంబంధించిన రైతులకు 2024-25 ఖరీఫ్‌కు రాయితీ విత్తనాలు మంజూరైనట్లు మండల వ్యవసాయాధికారి జీర గణేష్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేరుశనగ, పిల్లిపెసర, దయించ విత్తనాలు మంజూరయ్యాయని తెలిపారు. 40 శాతం రాయితీతో ఒక క్వింటం ధర రూ.9,500 ఉండగా.. రూ.5,700 పంపిణీ చేస్తామన్నారు. దయించ విత్తనాల క్వింటం ధర రూ.8,800 కాగా, 50 శాతం సబ్సిడీతో రూ.4,400, పిల్లి పెసర క్వింటం ధర రూ.13,400 కాగా, 50 శాతం రాయితీతో రూ.6,700లు అందజేయడం జరుగుతుందన్నారు. మండలంలోని రైతులు స్థానిక రైతుభరోసా కేంద్రంలో ఈ నెల 20 నుంచి అవసరమైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులకు అండగా ఉంటాం

మంత్రాలయం, మే 20: నియోజకవర్గంలో జైభీమ్ ఎమ్మార్పీఎస్ కార్యకర్తలకు ఏమి జరిగినా అందుబాటులో ఉండి అన్ని విధాలుగా ఆదుకుంటామని జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జిక్కిం జానయ్య అన్నారు. మండలంలోని చెట్నహల్లి గ్రామంలో దళిత వర్గానికి చెందిన ఇరువురు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఇందులో జైభీమ్ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నరసింహులు ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మిగనూరు ఆసపత్రిలో చికిత్స పొందుతున్న నరసింహులును పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని డాక్టర్లతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ముత్తు సుమాల, చెట్నపల్లి గ్రామానికి చెందిన జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

రాఘవేంద్ర నగర్‌లో తాగునీటి సమస్య పరిష్కరించాలి

ఎమ్మిగనూరు, మే 20: పట్టణంలోని రాఘవేంద్ర నగర్‌లో నెల కొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు గోవిందు, రాముడు డిమాండ్ చేశారు. సోమవారం కాలనీ వాసులతో కలసి మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 14 తరువాత మున్సిపల్ సిబ్బంది పట్టణంలో రోజు మార్చి రోజు నీటిని విడుదల చేశారు. అయితే రాఘవేంద్ర నగర్ కు ఇప్పటి వరకు తాగునీటి పైప్‌లైన్ వేయలేదు. దీంతో నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నప్పటికీ అవి కాలనీ వాసులకు ఎంత మాత్రం సరిపోవడం లేదన్నారు. కాలనీకి తాగునీటిని సరఫరా చేయాలని కోరారు. స్పందించిన కమిషనర్ గంగిరెడ్డి కాలనీకి తాగునీటి పైప్‌లైన్ వేయిస్తామని, ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక సీపీఎం నాయకులు తిమ్మప్ప, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

ఆలూరు, మే 20: సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు నందమూరి, జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ శ్రీకాంత్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అభిమాన సంఘ నాయకులు డాక్టర్ నెటప్ప, టీడీపీ తెలుగు యువత అధికార ప్రతినిధి సురేంద్ర మాట్లాడుతూ జూనియర్ ఎన్టీఆర్ సినీ, రాజకీయ రంగాల్లో ఉన్నత పదవులు అలంకరించాలన్నారు. కార్యక్రమంలో అభిమాన సంఘం నాయకులు మల్లి గౌడ్, ఈరన్న, మల్లేష్, అంజి, వీరన్న, గిరి, పాండు పాల్గొన్నారు.